క్లుప్తంగా

సీసీరోడ్డు పనులు ప్రారంభం



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో మిషన్ భగీరథ ద్వారా వేస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి గురువారం ప్రారంభించారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఇప్పటికే మిషన్ భగీరథ ద్వారా సీసీరోడ్లు వేయడాన్ని పూర్తిచేశారు. మరికొన్ని వార్డుల్లో వేయాల్సి ఉందని, వాటిని త్వరలోనే పూర్తిచేయిస్తామని చైర్‌పర్సన్ తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక, వార్డు కౌన్సిలర్లు చైతన్య, శశికిరణ్, కుమ్మరి రాజు, బీఆర్ఎస్ నాయకులు, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

అండర్ డ్రెయినేజీ పనులు

జడ్చర్ల: మండల పరిధిలోని కోడ్గల్‌లో గురువారం అండర్ డ్రెయినేజీ నిర్మాణ పనులను జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య ప్రారంభించారు. గ్రామ పంచాయతీ నిధుల ద్వార రూ.2లక్షల వ్యయంతో పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. పనులను నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ మమత, నాయకులు ఇమ్ము, రాంచంద్రయ్య, నర్సింలుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

1న విష్ణుసహస్రనామ పారాయణం పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతిదేవస్థానం–హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో వచ్చేనెల 1వ తేదీన జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు శ్రీవిష్ణు సహస్రనామ, స్తోత్ర పారాయణం పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 10నుంచి 15 ఏళ్లలోపు శ్రీవిష్ణు సహస్రనామ పారాయణంపై, 10 ఏళ్లలోపు వారికి అచ్యుతాష్టకం 9 శ్లోకాలపై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ రెండు విభాగాల్లో ప్రతభ చాటిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని, మిగతా వివరాల కోసం 9347540005 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

నవాబుపేట: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ వీరప్ప (54) గురువారం మృతి చెందారు. గత కొత కాలంగా అనారోగ్యంతో గురువారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మృతి చెందారు. స్థానిక నాయకులతో పాటు ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు సంతాపం ప్రకటించారు.

ఘనంగా లక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం



మిడ్జిల్: మండల పరిధిలోని వెలుగోమ్ములలో లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో పురోహితులు వేదమంత్రాలతో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రఘుపత్‌రెడ్డి, గ్రామ పెద్దలు బాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మహేష్, సత్యం, సత్య నారాయణ, మణ్యంరెడ్డి, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొకుంట్లలో కలపడం సరైంది కాదు



చిన్నచింతకుంట: తిర్మలాపురాన్ని చిన్నచింతకుంట మండలంలోనే కొనసాగించాలని గ్రామస్తులు జనార్దన్, వడ్డె మహేందర్, పంతులు శ్రీనులు డిమాండ్ చేశారు. గ్రామంలో క్రీడా మైదానం స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చిన ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్‌లకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నచింతకుంట మండల కేంద్రానికి దగ్గరలో ఉన్న తిర్మలాపురాన్ని కొత్తగా ఏర్పాటైన 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొకుంట్ల మండలంలో కలపడం సరైనది కాదన్నారు. కొకుంట్ల మండలంలో కలిపి గ్రామస్తులకు తీవ్ర అన్యాయం చేశారని వారు మండిపడ్డారు. కార్యక్రమంలో గ్రామస్తులు కుర్వ రాములు, చిన్న వెంకటన్న, మహేష్, బాలు, భాగ్యమ్మ ఉన్నారు.

కట్టడి చేసేలా..

- అక్రమాలకు ఫుల్‌స్టాప్
- ఉపాధి కూలీలకు ఆన్‌లైన్ హాజరు



బొక్కలోనిపల్లిలోని నర్సరీలో పాలిథిన్ కవర్లలో మట్టి నింపుతున్న కూలీలు

మహబూబ్‌నగర్ రూరల్: ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు ఆస్కారం లేకుండా సంస్కరణలు తీసుకొస్తున్నారు. తాజాగా కూలీల హాజరును ఆన్‌లైన్‌లో నమోదుకు శ్రీకారం చుట్టారు. జనవరి 1వ తేదీ నుంచి అధికారులు పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకొచ్చారు. ఇంతకుముందు మస్టర్ల ద్వారా పనుల వద్దకు వెళ్లి కూలీల వివరాలు నమోదు చేసేవారు. ఇకపై నేరుగా లైవ్ లొకేషన్‌లో ఉండి మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రతిరోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటలలోపు కూలీలు, పనుల వివరాలను నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్ (ఎన్ఎంఎంఎస్)లో పొందుపర్చాలి. 20 మందికి పైగా ఉంటే వారు పని చేసే ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. ఇక మండలంలోని 26 గ్రామాల పరిధిలో 10,987 జాబ్‌కార్డులు జారీ చేయగా.. 236 కూలీలు పని చేస్తున్నారు.

అడ్డుకట్ట పడేనా...

ఉపాధిహామీ పథకం అమల్లో ఏటా కొత్త నిబంధనలు తీసుకొస్తున్నా.. చేసినట్లు చూపించడం, కూలీల హాజరు శాతం ఎక్కువగా చూపడం ఉండేది. సామాజిక తనిఖీల్లో ఇలాంటివి బయటపడటం సాధారణంగా మారింది. వీటిని దృష్టిలో ఉంచుకొని పనుల వివరాలను జియోట్యాగ్ చేసినా అక్రమాలు ఆగలేదు. ఈ నేపథ్యంలో మరో కొత్త విధానం తీసుకొచ్చారు. మరి ఇప్పుడైనా అడ్డుకట్ట పడుతుందో లేదో ఎదురు చూడాల్సిందే.

వివరాల నమోదుకు తిప్పలు..

ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఈ మధ్యనే విధుల్లో చేరారు. కూలీలు పని చేసే చోటకు వెళ్లి ఫొటో తీసి ఆన్‌లైన్‌లో పొందుపర్చే బాధ్యత వారిదే. సొంత ఫోన్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉండటంతో కాస్త ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వారికి ఫోన్, సిమ్ కార్డు ఇస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు.

ఆన్‌లైన్‌లోనే హాజరు



ఈఏడాది జనవరి నుంచి ఉపాధి కూలీల హాజరు ఆన్‌లైన్‌లో ఉంటుంది. ఒకరు పనికొచ్చినా ఆన్‌లైన్ అటెండెన్స్ వేయాల్సి ఉంటుంది. తద్వారా కూలీలకు పేమెంట్ డైరెక్ట్‌గా పడిపోతోంది. ఈ ప్రక్రియను పక్కాగా అమలు చేయాల్సిందే. కొత్త విధానం ద్వారా కూలీలు, పనుల్లో పారదర్శకత పెరుగుతుంది. అక్రమాలకు ఆస్కారం ఉండదు.

– అఫ్జల్‌ఖాన్, ఏపీఓ, మహబూబ్‌నగర్ రూరల్

రైతులకు విద్య, హౌసింగ్ రుణాలు

డీసీసీబీ సీఈఓ లక్ష్మయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ సీఈఓ లక్ష్మయ్య

నవాబుపేట: సహకార సంఘాలు రైతుల కోసం మరిన్ని సేవలు తీసుకొచ్చిందని డీసీసీబీ సీఈఓ లక్ష్మయ్య తెలిపారు. గురువారం మండల పరిధిలోని రుద్రారం రైతు వేదికలో సహకార బ్యాంకు పరిధిలోని రైతులకు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ నర్సింహులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతుల కోసం చేపట్టిన వివిధ రకాల పథకాలు వివరించారు. గతంలో కేవలం రైతులకు పంట రుణాలు అందించిన సంఘాలు తాజగా రైతులకు వివిధ రకాలుగా సేవలు అందించేందుకు శ్రీకారం చుట్టిందని ఆయన తెలిపారు. బ్యాంకుల్లో కొందరికి మాత్రమే విదేశాలలో చదువుకు అందించే రుణాలు తాజగా సహకార సంఘం రైతులకు అందిస్తుందని ఆయన వివరించారు. రైతులకు కేవలం 5 ఎకరాల భూమి ఉంటే చాలని తమ పిల్లలకు విదేశీ విద్యకోసం రూ.25 లక్షలు, స్వదేశీ విద్యకు రూ.10లక్షల వరకు రుణాలు అందిస్తున్నామని ఆయన వివరించారు. అలాగే రైతులకు ఎలాంటి షరతులు లేకుండ హౌసింగ్ లోన్ సౌకర్యం రైతులకు కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. రైతులు 2 నుంచి 3 ఎకరాల భూమికలిగి వుంటే చాలు వారికి రూ.10లక్షల వరకు హౌసింగ్‌లోన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీంతో పాటు గోల్డులోన్లు సైతం సహకార సంఘాలు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా రైతులు తాము పొందిన దీర్ఘ కాలిక, స్వల్పకాలిక రుణాలు వెంటనే చెల్లించి బ్యాంకు అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, రైతు బంధు మండల చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, రుద్రారం సర్పంచ్ లలితమ్మ, నవాబుపేట సర్పంచ్ గోపాల్, కృష్ణగౌడ్, సంజీవరెడ్డి, లక్ష్మయ్య, రవి, బోజయ్య, కృష్ణయ్య, ప్రశాంత్‌రెడ్డి, నవాబుపేట సీఈఓ హన్మంతు ఉన్నారు.

'సంఘర్షణ యాత్ర'ను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

భూత్పూర్: రవాణా రంగ కార్మికుల సంఘర్షణ యాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నలవెళ్లి కురుమూర్తి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వి.కురుమూర్తిలు అన్నారు. భూత్పూర్ చౌరస్తాలో సంఘర్షణ యాత్ర వాల్‌పోస్టర్ విడుదల చేశారు. సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య, రవాణా రంగ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్, రమేష్‌లతో పాటు ఐదుమంది మినీ బస్సులో సంఘర్షణ యాత్ర చేస్తున్నట్లు ఆయన అన్నారు. ఆర్టీసీని పరిరక్షించుకోవాలని, మోటర్‌వాహన చట్టం 2019లో సవరణలు చేయాలని, కేరళలో మాదిరిగా సవారి తరహా యాప్‌ను దేశవ్యాప్తంగా తీసుకురావాలన్నారు. ఆర్టీసీ కార్మికులపై ఆంక్షలు ఎత్తివేయాలని, ప్రమాద బీమా రూ.10లక్షలు తదితర విషయాలపై సంఘర్షణ యాత్రను శుక్రవారం అడ్డాకుల, మూసాపేట, భూత్పూర్, మహబూబ్‌నగర్, హన్వాడ, మహ్మదాబాద్, నంచర్ల మీదుగా వికారాబాద్ జిల్లాలో వెళ్తుందన్నారు.

పనులను నాణ్యతగా చేపట్టాలి



పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రేమ్‌రాజ్

కోయిల్‌కొండ: తహసీల్దార్ కార్యాలయ భవన మరమ్మతు పనులను నాణ్యతతో చేపట్టాలని తహసీల్దార్ ప్రేమ్‌రాజ్ అన్నారు. గురువారం జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ మరమ్మతుల కోసం రూ.10 లక్షల మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. గతంలో కార్యాలయం వర్షాకాలంలో కురుస్తుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా నిధులను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనయ్య, మాజీ సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, అంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



దేవరకద్రలో పాత బోర్లలో మోటారును బిగిస్తున్న పంచాయితీ సిబ్బంది

దేవరకద్ర: పట్టణంలో నీటి సరఫరా కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేస్తున్నారు. ఇటీవల మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడంతో పట్టణంలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నారు. గతంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నీటి సరఫరాకు ఉపయోగించిన బోర్లను మళ్లీ రీ ఓపెన్ చేసి అందులో కొత్త మోటార్లను బిగిస్తున్నారు. ఎక్కడ కూడ నీటి సమస్య తలెత్తకుండ బోర్లను ఉపయోగించి వాటర్ ట్యాంకులను నింపి యథావిధిగా నీటి సరఫరా చేస్తున్నట్లు ఈఓ సీత్యానాయక్ తెలిపారు. మిషన్ భగీరథ అందుబాటులోకి వస్తే ఆ నీటిని కూడ సరఫరా చేయడానికి లైన్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్త బస్టాండ్ ప్రాంతంలో మిషన్ భగీరథ నీటిని సరాఫరా చేస్తున్నట్లు తెలిపారు.

అరుణోదయ రాష్ట్ర కార్యదర్శికి ఘన నివాళి



చిన్నచింతకుంటలో సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చిన్నచింతకుంట: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు సంస్కరణ సభలను గురువారం స్థానిక మండల కేంద్రంలో సీపీఐ ఎంఎల్ ప్రజాప్రంథ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అరుణోదయ రాష్ట్ర కోశాధికారి చంద్రన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జీఎస్ దేవదానం, ఏఐకేఎం ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్ఆర్ మన్యంలు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుబ్బారావు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ద్వారా తన కళా గానంతో వివిధ రంగాల కార్మికులలో, విద్యార్థి సంఘాలలో ఉద్యమ స్ఫూర్తిని నింపారన్నారు. పేద ప్రజలకోసం ఎన్నో పోరాటాలు చేపట్టారన్నారు. సుబ్బారావు ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండన్న, పెంటన్న, గోపాల్, వెంకటేష్‌గౌడ్, గుండన్న, బాబు పాల్గొన్నారు.

అర్హులకు అండగా ఉంటాం



అమిస్తాపూర్‌లో రిలే నిరాహారదీక్షలో మాట్లాడుతున్న దోకూర్ పవన్ కుమార్‌రెడ్డి

భూత్పూర్: మున్సిపాలిటీలోని సిద్దాయిపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులకు ఇచ్చే వరకు వారికి అండగా ఉంటామని బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో డబుల్ బెడ్రూం ఇళ్ల అర్హులకు ఇవ్వకుండా అనర్హులకే ఇచ్చారని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండవ రోజు కొనసాగింది. ఈ దీక్షకు మద్దతుగా ఆయన మాట్లాడారు. అధికార పార్టీకి చెందిన నాయకులు పేదలకు, అర్హులైన వారికి ఇవ్వకుండా అనర్హులకు ఇచ్చారని, అర్హులకు ఇచ్చేదాకా పోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రవీందర్, నాయకులు ఫారూఖ్, గాల్‌రెడ్డి, శ్రీను, రాజగోపాల్ రెడ్డి, మల్లేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు

జడ్చర్ల టౌన్: గురువారం ఉదయం మండలంలో పొగమంచు కమ్మేసింది. ఉదయం 8గంటల వరకు పొగమంచు కమ్మేయడంతో వాహనదారులు, పాదచారులు, వాకర్స్ కొంత అసౌకర్యానికి గురయ్యారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో లైట్లతో ప్రయాణం చేయాల్సి వచ్చింది. పొగమంచును చిన్నారులు, యువత ఆస్వాదించగా వృద్ధులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.



స్టేడియం మైదానంలో పొగమంచులో ఆసనాలు, వాకింగ్ చేస్తున్న పట్టణవాసులు



జాతీయరహదారిపై లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనాలు



పట్టణంలో కమ్మేసిన పొగమంచు

శబరికి తరలిన అయ్యప్పస్వాములు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని అయ్యప్ప భక్తులు గురువారం శబరిమల అయ్యప్ప కొండకు బయలు దేరారు. సుమారు 25మందికి పైగా అయ్యప్ప భక్తులు తరలివెళ్లినట్లు గురుస్వాములు శేఖర్‌స్వామి, విద్యాసాగర్‌స్వాములు తెలిపారు. అంతకుముందు గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో అయ్యప్పస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడులు ధరించి ప్రత్యేక వాహనాల్లో బయలుదేరారు. గురుస్వాములు నందుస్వామి, అశోక్, శ్యాంసుందర్, వెంకట్, వనం రాఘవేందర్, రంజిత్, రాము, గోవు, ప్రతాప్, పండు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

కోయిల్‌కొండ: మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా మండల అధికారులు చొరవ తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి మధుసూదన్‌గౌడ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో జరుగుతున్న క్రీడా ప్రాంగణాలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా హరితహారంలో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కలను ఇచ్చిన గడువులోగా సిద్ధంగా ఉంచాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాములు, సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి, ఎంపీఓ శ్రీదేవి, ఏపీఓ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలి



కోయిల్‌కొండ: మండలంలో హరితహారంలో భాగంగా గ్రామపంచాయతీలలో ఏర్పాటు చేస్తున్న వన నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. గురువారం మండలంలోని పారుపల్లి గ్రామపంచాయతీలోని నర్సరీని పరిశీలించారు. ఇచ్చిన గడువులోగా మొక్కలను సిద్ధంగా ఉంచాలని గ్రామపంచాయతీ అధికారులకు సూచించారు. ఆయన వెంట ఏపీఓ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ తనిఖీ

మహబూబ్‌నగర్ రూరల్: పెట్రోల్ బంక్‌ల్లో జరుగుతున్న అవకతవకలు. అక్రమాలపై సాక్షి దినపత్రిలో ప్రచురితమైన పలు కథనాలకు స్పందన లభించింది. పౌరసరఫరాల శాఖ అధికారులు గురువారం జిల్లా కేంద్రంలోని జైళ్లశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్ఓ బాలరాజు, డీటీలు నాగరాజు, స్వప్నలు బంక్‌లో పరికరాలను, పెట్రోల్, డీజిల్ నిల్వలను, కొలతలు, రీడింగ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు చేసిన తనిఖీల్లో ఎలాంటి అవకతవకలు, అక్రమాలు ఉన్నట్లు నిరూపణ కాకపోవడంతో బంక్‌లో అంతా సవ్యంగా జరుగుతున్నట్లు తెలిపారు. కాగా ముందస్తు సమాచారం ఇచ్చి అధికారులు తనిఖీకి రావడంతోతో బంక్‌లో ఎలాంటి అక్రమాలు వెలుగులోకి రాలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనాలకు స్పందించి అధికారులు పెట్రోల్ బంక్‌లో తనిఖీ నిర్వహించడం పట్ల పెట్రోల్, డీజిల్ వినియోగదారులు సంతోషం వ్యక్తం చేశారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

హన్వాడ: పీఆర్‌టీయూ నూతన క్యాలెండర్‌ను గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ఆవరణలో నిర్వహించారు. తహసీల్దార్ బక్క శ్రీనివాసులు, ఎంఈఓ రాజునాయక్ పీఆర్‌టీయూ క్యాలెండర్‌లను ఆవిష్కరించారు.

మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో పరిగి ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.



మహమ్మదాబాద్‌లో పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి



హన్వాడలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న యోగానంద్

జడ్చర్ల టౌన్: బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని నియోజకవర్గ పాలక్ యోగానంద్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన శక్తికేంద్రాల ఇన్‌చార్జ్‌లు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. బూత్‌స్థాయిలో మహిళలు ఉండే విధంగా కమిటీ వేయాలని, గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తున్న నిధులను తెలియజేయాలన్నారు. ఈనెల 7న నియోజకవర్గ బూత్‌స్థాయి కమిటీలతో సమావేశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్‌ను ఓడించి ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సామల నాగరాజు, జిల్లా అధికారప్రతినిధి సామల నర్సింహులు, కౌన్సిలర్ కుమ్మరి రాజు, మహిళానాయకురాలు బాలత్రిపురసుందరిదేవి నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

మిడ్జిల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను బూత్‌కమిటీ సభ్యులు గ్రామాల్లో ప్రజలకు వివరించాలని నియోజకవర్గం పాలక్ యోగానందజీ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శక్తి కేంద్రం ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు.

నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన బాలికలతో ప్రిన్సిపాల్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని గిరిజన పాఠశాల విద్యార్థులు ఖమ్మంలో నేటి నుంచి జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాగలత తెలిపారు. నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల నుంచి రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని కోరారు. వీరి ఎంపికపట్ల నెట్‌బాల్ కోచ్ రాంమోహన్‌గౌడ్, పీడీ కపిల్‌వర్మ, పీఈటీ భవాని హర్షం వ్యక్తం చేశారు.

హాస్టల్ విద్యార్థులకు స్టడీ చైర్స్ పంపిణీ



ఎస్సీ హాస్టల్‌లో చైర్స్‌ను పంపిణీ చేస్తున్న జిల్లా అధికారి పాండు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్‌లో ఎస్ఐ, కానిస్టేబుల్ పోటీ పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి పాండు స్టడీ చైర్స్, ప్యాడ్‌లు అందజేశారు. ఈ మేరకు ఎంపికైన వారిని ఆయన అభినందించారు. పోటీ పరీక్షల్లో బాగా కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగవచ్చన్నారు. పోటీ పరీక్షల కోసం ప్రతి హాస్టల్‌లో రూ.10వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం హాస్టల్‌లో రికార్డులు, రిజిస్టర్‌లను ఆయన పరిశీలించారు.

మౌలిక వసతుల కల్పనకే 'మన ఊరు–మన బడి'



మాట్లాడుతున్న ఎంపీపీ కదిరె శేఖర్ రెడ్డి

భూత్పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసమే మన ఊరు–మన బడిని సీఎం కేసీఆర్ చేపట్టినట్లు ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని లంబడికుంట తండా గ్రామ పంచాయతీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్రంలోని ప్రతి పాఠశాలల్లో మన ఊరు–మన బడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా ఎంపికై ప్రతి పాఠశాలల్లో విద్యార్థులకు విద్యతో పాటు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వార్షికోత్సవం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్, ఎంఈఓ నాగయ్య, విండో చైర్మన్ కదిరె అశోక్ రెడ్డి, సర్పంచ్ కమలమ్మ, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, ఎంపీటీసీ రమణి, కంప్లెక్స్ హెచ్ఎం కవిత, ఉపాధ్యాయులు పర్వీన్ బేగం, శ్రీనివాసులు, మాన్యానాయక్, బాలేమియా పాల్గొన్నారు.